హృదయోపదేశము
హృదయోపదేశము అను ఆధ్యాత్మిక బైబిలు సత్యాలు మీ ఆత్మీయ యాత్రలో తోడ్పడగలవని మేము కోరుతున్నాము.
Email: info@wisdomfortheheart.in | Web : www.wisdomfortheheart.in

# గొఱ్ఱెపిల్లకు నివాళి

(మొదటి భాగము)

## యోహాను 18:1-11

**పరిచయము**

నేను మిమ్మును యోహాను 18వ అధ్యాయమునకు ఆహ్వానించాలనుకుంటున్నాను. ఎంతో కాలము నుండి యేసు తెలియజేస్తు వస్తూ ఉన్న ఆ సమయము ఆసన్నమైనది. ఆ ఘడియ వచ్చేయున్నది. అప్పగింపబడి, శ్రమపరచబడి, సిలువవేయబడు- ఆ ఘడియ వచ్చేయున్నది.

ఏ మానవుడు ఎప్పటికీ అనుభవించలేని బహుకష్టమైన ఘడియలను ప్రభువు ఎదుర్కొననైయున్నాడు. భూమికి పునాదులు వేయబడక ముందే సర్వోన్నతుడైన దేవునిచేత నిర్ణయించబడిన ఆ వేదనకరమైన పాత్రను ఆయన త్రాగనైయున్నాడు.

మనముందున్న తరువాతి రెండు అధ్యాయములు ప్రభువు జీవితములోని చివరి ఘడియలను తెలియజేస్తాయి. ఈ అధ్యాయములు బాధ, ఎడబాటు వలన రోదనను మరియు మరణమును మనము తిరిగి చూస్తే అవి ఆ దేవుని గొఱ్ఱెపిల్లకు ఇవ్వబడే గొప్ప నివాళి తప్ప మరేమీ కావు. అవి ఆయన ప్రేమకు, త్యాగమునకు మరియు దయకు ఇవ్వబడే నివాళులు. ఈ నివాళిని అధ్యయనం చేసిన దానిని బట్టి మనమును ఆయనను పోలి మన జీవితములు కూడ ఆ గొఱ్ఱెపిల్లకు సజీవ నివాళి అగునట్లుగా సమర్పించుకొనవలెను.

యోహాను 18:1 వచనము చూడండి.

***"యేసు ఈ మాటలు చెప్పి తన శిష్యులతో కూడ కిద్రోను వాగు దాటి పోయెను. అక్కడ ఒక తోట యుండెను. దానిలోనికి ఆయన తన శిష్యులతో కూడ వెళ్లెను."***

కొన్ని వందల సంవత్సరముల క్రితము, రాజైన దావీదు త్వరగా ఈ కిద్రోను లోయను దాటి మరియు ఈ వాగు అవతలకు వెళ్లెను. ఇది అతని స్వంత కుమారుడు అతడిని మోసగించి మరియు రాజ్యప్రజలు ఆయనను తృణీకరించినప్పుడు జరిగినది.

కొన్ని వందల సంవత్సరముల తరువాత తన స్వంత శిష్యులలో ఒకనిచే మోసగించబడనైయున్న మరియు రాజ్యము చేత తృణీకరింపబడిన దావీదు కుమారుడు కిద్రోను వాగు దాటుచున్నాడు. ఆ మోసగాడు కూడా అబ్శాలోము నుంచే, అబ్శాలోము ఎలా చెట్టుకు వ్రేలాడదీయబడి నమ్మకమైన సైనికుల బడిసెలకు బలైపోయాడో దానిని నేర్చుకొని యుంటాడు అందుకే తరువాత త్వరగా యూదా చెట్టునకు ఉరివేసుకొని చనిపోతాడు.

దీనిలో మరొక ఆసక్తికర సత్యాన్ని నేను కనుగొన్నాను. పస్కాపండుగ సమయంలో ఈ సంగతులు జరిగినవి. ఒకవారమంతా జరిగే పండుగలో ఇప్పటికే కొన్ని వేల గొఱ్ఱెపిల్లలు వధించబడ్డాయి. ఈ గొఱ్ఱెపిల్లల రక్తము అర్పణగా దేవుని బలిపీఠముపై ప్రోక్షించబడింది. యేసు చనిపోయిన సరిగ్గా ముప్పై సంవత్సరములకు జరిగిన గణాంకములలో ఆపండుగలో అర్పించబడిన గొఱ్ఱెపిల్లలు దాదాపుగా 2,56,000 అని లెక్కగట్టారు.

అయితే ఈ బలిపీఠము యొద్ద నుండి ఈ అర్పించబడిన రక్తము ప్రవహించుటకు ఒక కాలువ త్రవ్వబడినది అది చివరకు ఈ కిద్రోను వాగులో కలుస్తుంది. ఈ రక్తము ఈ వాగు నీటిలో కలిసిపోయి ఉంటుంది. యేసు ఈ వాగును దాటేటప్పటికి ఈ వాగు అంతా రక్తముతో కలిసిపోయి ఉండవచ్చు. ఖచ్చితముగా,

తన మనస్సులో, త్వరలో లోకపాపములు మోసికొని పోవుటకు వచ్చిన దేవుని గొఱ్ఱెపిల్లగా తన రక్తము ప్రోక్షించబడును అని ఆయనకు తెలుసు.

### యూదా అప్పగించిన విధము - ఓ వెఱ్రితనము!

ఆ తోటలోనికి ప్రవేశించిన మొదటి వ్యక్తి యూదా- అతనప్పటికే సాతానుచే ఆవరించబడెనని మనకు తెలుసు. 2వ వచనమును గమనించండి.

***"యేసు తన శిష్యులతో పలుమార్లు అక్కడికి వెళ్లుచుండేవాడు గనుక, ఆయనను అప్పగించు యూదాకును ఆ స్థలము తెలిసియుండెను."***

యూదా వెళ్లుటలోని ఉద్దేశము ఇప్పటికే తేటపర్చబడినది. అది కేవలము ధన దాహము. ఎప్పుడైతే అతని లోభ హృదయము, యేసు యొక్క రాజ్య ఆలోచనలు రోమా సామ్రాజ్యము కూల్చుట కాదు అనియు, మరియు యేసు వాగ్దానము చేసిన శిష్యులందరి సింహాసనములు ఇప్పుడు ఈలోకములో నెరవేరవు అని అర్థము చేసుకున్నదో, అతడు "పొందుకొనుట ఉత్తమం" అనుకొని ఏది దొరికితే అదే చాలు అని నిర్ణయము తీసుకున్నాడు.

అతనిప్పటికే తన నమ్మకత్వమును ముప్పై వెండి నాణెములకు అమ్మివేసుకున్నాడు. ఇది బానిసకిచ్చే అతి తక్కువ వెల అని ప్రాచీన గ్రంథాలు తెలియజేస్తున్నాయి. ఈ ముప్పై వెండినాణెములు ఒక ఎద్దుచేత పొడవబడిన బానిసను కొనడానికి పెట్టు వెల అని మరొక పుస్తకము తెలియజేస్తుంది. అనగా యూదా రక్షకుని అవిటిబానిసకు ఇచ్చు వెలకు అమ్మివేసాడు.

నిజానికి యూదాను అర్థము చేసుకోవడము నాకు సాధ్యము కాలేదు. మాక్స్ లుకాడో కొంత కాలము క్రితమే వ్రాసిన ''అన్ ద అనెవైల్'' అనే పుస్తకము నా ఆలోచనను ఇనుమడింపజేసింది. నేను దానిని చదివినప్పుడు లుకాడో ఒప్పుకున్నట్లుగా నేను కూడా యూదాను గూర్చి ఆలోచిస్తాను అని నాకు అర్థమయినది, ఆయన వ్రాస్తూ,

*నేను ఎప్పుడూ యూదాను పటిష్ఠమైన, గాజు కళ్లు గల, నక్కజిత్తుల మనస్సు గల, పొడవైన గడ్డముతో యుండే వాడిగా ఊహించుకొనేవాడిని. మిగిలిన అపొస్తులులకు కొంత విభిన్నమైన వానిగా భావించే వాడిని. స్నేహితులు లేని, దూరపర్చబడిన, ఖచ్చితముగా ద్రోహి...అయిననూ అతడు ఒంటరివాడుగా యున్నట్లు మనకే ఆధారము లభించదు. ఆ రాత్రి భోజన సమయములో యేసు తనను అప్పగించువాడు ఆ బల్లపై కూర్చున్నాడని చెప్పినప్పుడు మిగిలిన శిష్యులందరూ ద్రోహిగా యూదాను ఒక్కసారిగా గుర్తించి ఆయనవైపు చూడలేదు. మనము యూదాను గూర్చి తప్పుగా చిత్రీకరించుకున్నామని నా ఆలోచన, అతడు పటిష్ఠమైన లేక కపటమైన వాడుగా కాక అందరినీ నవ్వించే లేక తుంటరివాడై యుండవచ్చు. నిశ్శబ్దముగా యుండే వాడుగా గాక అందరికీ అన్ని పనులు చేసేవాడై యుండవచ్చు.*

అయితే ఎలా యూదా దేవుని గొఱ్ఱెపిల్లను మోసముతో అమ్మివేయగలిగాడు? అన్న ప్రశ్న మిగిలే యున్నది. యూదా యేసుతో నడచినట్లు, యేసుతో మాట్లాడినట్లు, యేసుతో కలిసి భోంచేసినట్లు, అవే కొండ ప్రాంతాలలో మరియు యేసుతో పాటే అద్దె ఇంటిలో నిద్రించినట్లు ఖచ్చితముగా మనకు తెలుసు. ఆయన గొఱ్ఱెపిల్లను సంవత్సరాలుగా వెంబడించాడు; ఆయన బోధించుట విన్నాడు; ఆయన అద్భుతములు చేయగా చూసాడు. కానీ యేసు హృదయాన్ని యూదా తెలుసుకోలేకపోయాడన్నది సత్యము.

లుకాడో వ్రాస్తూ

*యేసు క్రియలు అతనికి తెలుసు కాని అతడు యేసు ఎందుకు వచ్చాడో గ్రహించలేదు. ఆయన పైకి భక్తి గలవానిగా ఉన్నాడు కానీ అతను యేసుతో ఏ సంబంధము కలిగిలేదు.*

ఇప్పుడు 3వ వచనమును గమనించండి, ఇది కూడా నాకు ఆశ్చర్యము కలిగించే వచనమే.

***"కావున యూదా సైనికులను, ప్రధాన యాజకులు, పరిసయ్యులు పంపిన బంట్రౌతులను వెంటబెట్టుకొని, దివిటీలతోను దీపములతోను ఆయుధములతోను అక్కడికి వచ్చెను."***

గమనించండి– వారు జరగబోయే దానికి తప్ప మరి దేనికైనా సిద్ధముగా ఉన్నారు. వారు కనీసం మూడు విషయాలకు సిద్ధపడియున్నారని నా అభిప్రాయము.

**వారు మోసపోకుండుటకై సిద్ధపడియున్నారు.**

1. మొదటిగా వారు మోసపోకుండుటకై సిద్ధపడి యున్నారు. అందుకే యూదాను ముద్దుతో యేసును గుర్తించమని ప్రణాళిక వేశారు.

ఒక వేళ ఆయన శిష్యులలో ఎవరైన ఒకరు "నన్ను బంధించండి, నేనే యేసును" అని ముందుకు వస్తారను కొనియుండవచ్చు.

వారు అట్టి నమ్మకమైన శిష్యులు ఉంటారని సిద్ధపడియున్నారు.

ఈ సమూహమంతా తోటలోనికి ప్రవేశించిన తరువాత, ఈ విషయాలను మార్కు 14:45లో చక్కగా వ్రాస్తాడు. యూదా యేసు యొద్దకు వెళ్లి "ప్రియమైన బోధకుడా" అని అర్థమిచ్చేట్టుగా "రబ్బీ" అని అన్నాడు.

అప్పుడు ఆయన యేసును ముద్దుపెట్టుకొనెను "ముద్దు" కు ఉపయోగించబడిన గ్రీకు పదము "కాటఫిలెయా" ఇది హృదయమును హత్తుకొని మరియు బుగ్గలపై పలుమార్లు ముద్దు పెట్టుకొను లోతైన భావమును చూపిస్తుంది.

క్రీస్తు దినములలో ముద్దు సాధారణ విషయము. ఒక గురువుకు మరియు విద్యార్థికి మధ్య వుండే ముద్దు గౌరవమునకు మరియు భక్తికి సాదృశ్యముగానున్నది. తక్కువ స్థాయి వారు, ఎక్కువ స్థాయి వారి చేతి హస్తము వెనుక ముద్దు పెట్టుకునేవారు, కానీ అదే వారు బానిసలను మించిన స్థాయి గలవారైతే అరచేతిని ముద్దుపెట్టుకునేవారు. కోపముతో నున్న రాజు క్షమాపణను కోరుకునేవారు అతని పాదములను ముద్దుపెట్టుకునే వారు. తరచుగా బానిసలు తమ యజమానుల కాళ్ళను ముద్దు పెట్టుకునేవారు. మనము కూడా ఇతరుల దయ పొందకొనుటకు తెలియజేసే రీతిగా "ఒకరిని ముద్దుపెట్టుకొనుట" అనే మాటను ఉపయోగిస్తుంటాము. కానీ బుగ్గపై ముద్దు ప్రేమకు మరియు సాన్నిహిత్యమునకు గుర్తు.

అంటే, యూదా యొక్క ముద్దు మోసపూరితము; ఇది అబద్ధ ప్రేమకు నిదర్శనము.

మరో సంగతి, ఈ మోసం వెనుక ఉన్న ఆత్మీయ సత్యమేమంటే, అపవాది రక్షకుని గుర్తించుచున్నది. ఘట సర్పము కుమారుని కౌగలించుకొనుచున్నది; సింహము గొఱ్ఱెపిల్లను గట్టిగా పట్టుకుంటుంది. ఆ ఆది సర్పము యొక్క వేడి ఊపిరి మానవజాతి విమోచకుని చెక్కిళ్లను తాకుచున్నది. అయితే ఇదంతా యేసుకు తెలుసు!

మోసముతో అప్పగింపబడుట ఎప్పుడూ బాధాకరమే, కాని అది ఒక ముద్దుతో అయితే; అనగా అది ఒక దగ్గర వ్యక్తి ద్వారా అంటే స్నేహితుడో లేక బంధువో అయితే అది హృదయాన్ని ముక్కలు చేస్తుంది. అయిననూ యేసు ఏ మాత్రమూ ప్రతిఘటించడము లేదు. "యూదా నీవు నన్ను అప్పగించబోవు చున్నావా? నాయొద్దనుండి తొలగిపో" అని ఎంత మాత్రము అనలేదు.

మత్తయి 26:50లో యేసు కేవలము '*'చెలికాడా, నీవు చేయవచ్చినది చేయుము"* అని చెప్పినట్లు వ్రాసారు.

దీనికి అన్వయమును గూర్చి కెంట్ హ్యూగ్స్ (KentHughes) గారు వ్రాస్తూ, యేసు కేవలము "....మీ శత్రువులను ప్రేమించుడి, మరియు మిమ్మును హింసించు వారి కొరకు ప్రార్థన చేయుడి..." అని చెప్పి ఊరుకోలేదు, మత్తయి 5:44లో వ్రాయబడినట్లు దానిని చేసి చూపించాడు! ఆయన బోధించిన దాని నెల్లనూ అనుసరించి చూపెను! ఆ సమయములో ఆయనచేసి చూపినది ఆయన ప్రేమకు అద్భుతమైన మాదిరి!

ఫిలిప్పీ 2:5 ప్రకారము మనమునూ అలాగున చేయుటకే పిలువబడ్డాము.

***"క్రీస్తు యేసునకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి."***

మీరెప్పుడైనా మోసగింపబడి, తప్పుగా అర్థము చేసుకోబడి, తృణీకరింపబడి మరియు విడిచిపెట్టబడ్డారా? అది ఒక ముద్దుతో జరిగిందా? ఆ వ్యక్తిని వదిలించుకోవాలి అని మీరెప్పుడైనా అనుకున్నారా? అతనిపై అసహ్యమును పెంచుకున్నారా? కాని యేసు "మీరట్లు చేయరాదు." అని చెబుతున్నాడు.

మరికొన్ని నిమిషములలో అంత మోసమును యేసు శాంతముగా ఆ పరిస్థితిని ఎలా ఎదుర్కొగలిగాడో నేను మీకు చూపాలనుకుంటున్నాను.

**వారు పిరికితనమును ఊహించారు**

2. మొదట, వారు మోసమునకు సిద్ధమగుటయే కాదు పిరికితనమును కూడ ఊహించిరి. మరొకసారి యోహాను 18: 3 చూడండి.

***"... (వారు) దివిటీలతోను దీపములతోను ఆయుధములతోను అక్కడికి వచ్చిరి"***

బార్క్లే గారు చక్కగా దీనిని జతపర్చుచు యేసు దాక్కుంటాడేమో అని వారు అనుకొన్నారు అని అన్నారు.

18వ వచనము మనకు ఏమి చెబుతుందంటే, పస్కా పండుగనాడు పౌర్ణమిరోజు. ఆ రాత్రి ఆకాశము మేఘములు లేనిదై మిక్కిలి చలిగా వున్నది. ఆ రోజు వెలుతురు చాలినంతగా వుండి వారు తోటలోనికి వెళ్లడానికి మార్గము స్పష్టముగా కనిపిస్తూ వున్నది. నాయకులకు ఒకటో లేక రెండో దివిటీలు కాక వారందరి చేతులలోనూ అన్ని దివిటీలు ఎందుకు? యేసు దాగుకొన వచ్చునని వారనుకుని వుండవచ్చు. కనుక ఆ తోటలోని చెట్ల వెనుకనో, కొండ సందులలోనో యేసును వెతికి పట్టుకోవలసి వస్తుందేమోనని వారనుకొనియుంటారు. ఒలీవ చెట్ల వెనుక లేక ప్రతి రాయి వెనుక యేసుని వెదకుటకు దివిటీలు అవసరమౌతాయని వారు అనుకుని వుంటారు.

కాని 4వ వచనము చూస్తే – యేసు దాగుకొనుటకు బదులు వారి ముందుకు వచ్చి మీరు వెదకుచున్నది నా కొరకే అని వారికి తనను తాను బహిరంగపరచుకొనెను.

**వారు ప్రతిఘటనను ఊహించినారు.**

3. చివరిగా, అర్ధరాత్రి వేళ ఆయనను బంధించుటకు వచ్చిన నాయకులు వారినుండి ప్రతిఘటనను ఊహించారు.

మూడవ వచనములో చూస్తే యూదా అతనితో పాటుగా రోమా పటాలమును తీసుకొని వచ్చినట్లున్నది. ఒక పటాలము అనగా ఆరువందల ఆయుధములు ధరించిన రోమా సైనికులు కలరు. వారితో పాటుగా సన్హెద్రిను సభ వారైన ప్రధాన యాజకులు మరియు పరిసయ్యులు ఉన్నారు.

ఆలయ కార్యక్రమములు సరిగా నిర్వర్తింపజేయుటకు ఒక వ్యక్తిగత సైనిక పటాలము మరియు సన్హెద్రిను సభ తీర్పులు వెలువరించుటకును మరియు వాటిని అమలుచేయుటకును సన్హెద్రిన్ సభ యొక్క సైనిక అధికారులును కలరు.

ఎందుకు వందల కొలది రోమన్ సైనికులు మరియు యూదుల సైనిక బలగాలు రావలసి వచ్చింది? ఎందుకు ఒక సామాన్య నిరాయుధుడైన గలిలయ వడ్రంగిని ఖైదు చేయుటకు అంతమంది సైనిక బలము వచ్చినది?

ఆయన సామాన్య వ్యక్తి కాదు అని వారికి తెలుసు గనుక. ఆయన చేసిన ఆశ్చర్యక్రియలు వారు చూచిరి మరియు పలు సందర్భములలో ఆయనను పట్టుకొనుటకు ప్రయత్నించిరి కానీ ఆయన వారి నుండి చాకచక్యముగా తప్పించు కొనగలిగారు.

అందుకే ఈ పర్యాయము ఒక అసాధారణ శక్తిని ఎదుర్కొనుటకు సిద్ధపడి వచ్చారు. వారు కేవలము ఆ పండ్రెండు మందినే కాదు అద్భుతములు చేయు ఆశ్చర్యకరుడైన యేసుని ఎదుర్కొనవలెను అని సిద్ధపడి వచ్చారు కనుక అంత సైన్యమును పంపిరి. కాని వారు జరగబోవు దానికి సిద్ధపడి లేరు.

**యేసు ప్రకటన !**

4వ వచనము నుండి 6వ వచనము వరకు చదవండి.

***"యేసు తనకు సంభవింపబోవునవన్నియు ఎరిగినవాడై వారియొద్దకు వెళ్లి– మీరెవని వెదకుచున్నారని వారినడిగెను. వారు నజరేయుడైన యేసునని ఆయనకు ఉత్తరమియ్యగా***

***యేసు-ఆయనను నేనే అని వారితో చెప్పెను; ఆయనను అప్పగించిన యూదాయు వారి యొద్ద నిలుచుండెను. ఆయన-నేనే ఆయననని వారితో చెప్పగా వారు వెనుకకు తగ్గి నేల మీద పడిరి"***

ఇక్కడ మీరు అర్థం చేసుకోవాల్సిందేమిటంటే, కేవలంవారు వెతుకుతున్నది ఈయననే అని గుర్తించుట మాత్రమే కాదు గాని, ఇదే సమయంలో మూడు విషయములు ఏకకాలంలో జరిగినవి.

**1. ఆయన తన దైవత్వాన్ని ప్రకటిస్తున్నాడు**

మరొకసారి 5 మరియు 6 వచనములు గమనిస్తే మీకు ఇది వరకే బహుశా పరిచయమున్న "ఎగొ ఇమి" లేక "నేనే" అనే పదాలతో తనని తాను పరిచయము చేసుకుంటున్నాడు.

మండుచున్న పొద యొద్ద మోషేకు మొదటిసారిగా దేవుని పేరు వెల్లడిచేయబడినది. నిర్గమకాండము 3:14లో "ప్రభువా నీ పేరేమని ప్రజలకు చెప్పుదును?" అని మోషే అడిగాడు.

అందుకు దేవుడు జవాబిస్తూ "ఉందునను వాడనని వారితో చెప్పుము" అని మోషేకు ప్రత్యుత్తరమిచ్చెను.

సెప్తుజింటులో వ్రాయబడిన ఆ గ్రీకు పదాలు "ఎగొ ఇమి".

ఇప్పటికే యోహాను సువార్తలో ప్రభువు మత పెద్దలకు తనను "ఎగొ ఇమి"గా బయలుపర్చుకొని ఆశ్చర్యపర్చారు. ఇది ఆయన నేను దేవుడను అని చెప్పుకోవడం! మరియు ఈ వచనములలో ''నేనే'' అను సర్వోన్నతుడైన దేవుని పేరును తనకు ఆపాదించుకుంటున్నాడు.

6వ వచనము గమనించండి

***"...వారు వెనుకకు తగ్గి నేలమీద పడిరి."***

ఆ సర్వశక్తుని ఊపిరి వారు నేలను పడునట్లు వారి వీపులను తట్టినది! ఇది క్రీస్తు స్వయముగా తన దైవత్వముపై యున్న ముసుగును ఒక్క సెకను తొలగించినట్లున్నది. అందుకే దేవుని సన్నిధిలో అందరూ చేయునట్లుగా వారు చేసారు - ఆయన ముందు సాష్టాంగపడిరి.

**2. ఆయన తన అధికారమును ప్రకటిస్తున్నాడు**

యేసుదే ఇక్కడ పైచేయి ఆయన ఏ తప్పిదము చేయలేదు! ఎవ్వరూ ఆయన ప్రాణమును తీసుకొనలేరు. ఆయనే దానిని పెట్టుటకు నిశ్చయించుకున్నాడు. ఆయన దాగుకొనుట లేదు, వెల్లడి చేసుకుంటున్నాడు! ఆయన పారిపోవడము లేదు . ఆయనే ముందుకు వస్తున్నాడు. అందుకే ఆయన భయముతో నున్న, అయోమయములో నున్న శత్రువుకు తనను బంధించుటలో సహాయము చేస్తున్నాడు.

ఈ నిర్ణయము సన్హెద్రిను సభదో, మత నాయకులదో, ఇశ్రాయేలు దేశముదో లేక రోమా చక్రవర్తిదో కాదు- ఇది "నేనే" అన్న గొఱ్ఱె పిల్ల యొక్క నిర్ణయము. ఆయన యాధృచ్ఛికంగా బలైనవాడు కాడు. ఎందుకు? ఎందుకనగా ఆయన చనిపోవడానికి ముందే నిర్ణయించుకున్నాడు.

**ఆయన తన మాట నెరవేర్చుచున్నాడు**

ఏడు నుండి తొమ్మిది వచనములు గమనించండి.

***'మరల ఆయన మీరు ఎవనిని వెదకుచున్నారని వారిని అడిగెను. అందుకు వారు నజరేయుడైన యేసునని చెప్పగా, యేసు వారితో నేనే ఆయనని మీతో చెప్పితిని గనుక మీరు నన్ను వెదుకుచున్న యెడల వీరిని పోనియ్యుడని చెప్పెను. నీవు నాకు అనుగ్రహించిన వారిలో ఒకనినైనను నేను పోగొట్టుకొనలేదని " ఆయన చెప్పిన మాట నెరవేరునట్లు ఈలాగు చెప్పెను."***

మరోలా చెప్పాలంటే, యేసు 'అక్కడ ఒక్కటే సిలువ అని, పండ్రెండు కాదని(ఇద్దరు నేరస్థులు తప్ప), ఆయనతోపాటు శిష్యులెవరూ చనిపోరు అని అంతకుముందే చెప్పినమాటను నెరవేర్చునట్లు ఈలాగు చేసెను.

## నిర్లక్ష్యము - అదే పేతురు ధైర్యము

ఇప్పుడు పేతురు దగ్గరలోనే నిలబడి వీటినన్నిటినీ పరిగణ లోకి తీసుకుని, ఏదైనా కొంత చేయడానికి ఇదే సరైన సమయమనుకున్నాడు. అందుకే 10వ వచనములో మనకు తెలియబడినది.

***"సీమోను పేతురు నొద్ద యుండిన కత్తిని తీసుకుని, ప్రధాన యాజకుని దాసుని కొట్టి అతని కుడి చెవి తెగ నరికెను. ఆ దాసుని పేరు మల్కు"***

అయితే ఇక్కడ పేతురు సరిగా కత్తి దూయలేదు లేక మల్కు తప్పించుకోగలిగేంత జాగ్రత్త కలిగియుండాలి. అందుకే పేతురు యొక్క చిన్న "బాకు" అతని తల నరకలేకపోయి నప్పటికీ అతని కుడిచెవిని మాత్రము నరికివేయగలిగినది.

ఇక్కడ ఒక్కసారి ఆగండి. మనము పేతురు మూడుసార్లు బొంకుట వలన అతడు బలహీనుడును, నమ్మకమైనవాడు కాదు అని అధైర్యపరుడని అంటుంటాము. అయితే దాని గూర్చి మనము తరువాత తెలుసుకుందాము. కాని ఇప్పుడు ఆయన ధైర్యమును గమనించమని చెబుతున్నాను.

ఈ సమయములో పేతురు ఒక్కడే వందల మందిపై కత్తి దూసినాడు. పేతురు ఒక్కడే క్రీస్తు కొరకు నిర్లక్ష్యముగా వందల మంది సైనికులను ఎదుర్కొనుటకు సిద్ధపడ్డాడు. అతనికి మంచి జరుగును గాక, అదీ పేతురు! దేవునికొరకు నేడు మనలో సీమోను పేతురుల వంటి వారు అనేకలు ఉన్నారు.

మనలో ఇబ్బందులను లెక్కించుకొనే వారు అనేకులు ఉన్నారు, మనలో రానున్న కష్టాలను గురించి హెచ్చరించువారు అనేకులు ఉన్నారు. మనలో ఓటములను తలంచుకొని తర్జనబర్జన పడేవారు అనేకులు ఉన్నారు. కాని మనలో క్రీస్తు ఘనత కొరకు దేనినైనా ఎదుర్కొనడానికి తగినంత మంది లేరు.

కాని పేతురు ఎదుర్కొన్నాడు ! అతనికి అంత ధైర్యమెక్కడి నుండి వచ్చిందో నేను ఖచ్చితంగా చెప్పలేను. బహుశా పేతురు ఒకవేళ నేనేదైనా సమస్యలో చిక్కుకొనిపోతే యేసు అందరూ క్రింద పడునట్లు మరలా చేస్తాడు అని అనుకొని ఉంటాడు.

అందుకే పేతురు కత్తి దూసాడు, సేవకుడు అరిచాడు, సైనికులందరూ ఎగిసిపడుతున్న పేతురు గుండెకు తమ ఈటెలు ఎక్కుపెట్టారు.

ఒక రచయిత దానిని చక్కగా వివరిస్తున్నాడు. అదేమిటో గమనిద్దాము.

*"మల్కుస్ రక్తము తన చేతి వేళ్ల మధ్య నుండి కారుచుండగా పెద్దవిగా చేయబడిన కన్నులతో నిలువబడి యున్నప్పుడు అక్కడ వున్న వందలాది కత్తులు వరలో నుంచి ఒక్కసారిగా లాగు చున్నప్పుడు వచ్చిన శబ్దముతో ఆ తోటలో ఎంత ఉద్రికత్త ఉండి ఉంటుందో ఊహించండి"*

అప్పుడేం జరిగింది?!

మత్తయి సువార్త 26:52,53 వచనములో యేసు చెప్పిన మాటలు చూడండి.

***"యేసు నీ కత్తి వరలో తిరిగి పెట్టుము; కత్తి పట్టుకొనువారందరు కత్తిచేతనే నశింతురు. ఈ సమయమున నేను నా తండ్రిని వేడుకొనలేననియు, వేడుకొనిన యెడల ఆయన పండ్రెండు సేనా వ్యూహముల దూతల దండు కంటే ఎక్కువ మంది దూతలను ఇప్పుడే నాకు పంపడనియు నీవనుకొనుచున్నావా?"***

మరొక మాటలో "పేతురూ, ఈ యుద్ధమును మనము ఇనుప కత్తులతో చేయడం లేదు. ఒకవేళ ఆలాగున చేయాలనుకుంటే ఇప్పుడే, ఇక్కడే డెబ్బైరెండు వేల దూతలు నా ప్రక్కనుండేవారు. కాని నిజముగా మనము చేసేది అలాంటి యుద్ధము కాదు." అన్నాడు.

పౌలు 2కొరింథీ 10:4 వ్రాస్తున్నప్పుడు ఇదే మనోభావమును వ్యక్తము చేస్తున్నాడు.

***"మా యుద్ధోపకరణములు శరీర సంబంధమైనవి కావుగాని, దేవుని యెదుట దుర్గములను పడద్రోయగలిగినంత బలము కలవైయున్నవి."***

ఆయన ఎఫెసీ 6:12లో వ్రాస్తూ,

***"ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, గాని ప్రధానులతోను, అధికారులతోను ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాథులతోను, ఆకాశమండల మందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము."***

ఈ సమూహముతో యేసు ఏమి చెప్పెనో మీకు తెలుసా? ఆయనను వారు తోటలో నుండి బయటకు తీసుకొని వెళ్లడానికి ముందు యేసు చెప్పిన విషయాలను లూకా 22:53వ వచనములో వ్రాస్తున్నాడు.

***"...అయితే ఇది మీ గడియయుఅంధకార సంబంధమైన అధికారమును అనెను."***

దీనినే వారెన్ వియర్స్బి వ్రాస్తూ,

*"పేతురు ఒక అసలైన శత్రువుతో కాకుండా, సరైన ఆయుధములతో కాక, అవసరమైన ఆలోచనతో కాక అనవసరమైన విషయాల కొరకు యుద్ధము చేస్తున్నాడు!"*

అయితే ఈ గాయపడిన సైనికుని మాటేమిటి? మరొక్కసారి లూకా22:50,51 వచనములు చదవండి.

***"అంతలో వారిలో ఒకడు ప్రధానయాజకుని దాసుని కొట్టి, వాని కుడి చెవి తెగ నరికెను. అయితే యేసు ఈ మట్టుకు తాళుడని చెప్పి, వాని చెవి ముట్టి బాగుచేసెను."***

వారి హేయ ప్రవర్తన మధ్యలో దయను మీరు చూడగోరుచున్నారా? దేవుని శత్రువుల కొరకు ఆయన అందించుచున్న దేవుని ప్రేమను చూడాలనుకుంటున్నారా? ఇదిగో ఇక్కడే!

మత్తయి, మార్కు, లూకా మరియు యోహాను సువార్తలు పేతురు ఆ సేవకుని చెవిని నిజముగానే నరికి వేసినట్లు చెబుతున్నాయి. ఇక్కడ వ్రాయబడిన గ్రీకు పదము అర్థము "చీల్చి వేయుట లేక తెంచి వేయుట" అయిననూ యేసు ఆ సేవకుని స్వస్థపర్చినట్లు కేవలము లూకా సువార్తలోనే చదువుతాము. ఒకవేళ వైద్యుడైన లూకాకి మాత్రమే అది ఆసక్తికర విషయముగా తోచివుంటుంది!

వైద్యుడైన లూకాగారు ఈ శస్త్ర చికిత్స అంతటిని గూర్చిన విషయాలను యేసు ఆ తెగి పడిన చెవిని తీసి దానిని తిరిగి ఎలా అతికించాడో వ్రాయడము లేదు కానీ సామాన్యముగా "...(యేసు) అతని చెవిని ముట్టి స్వస్థపర్చెను అని మాత్రమే వ్రాయుట" నాకెంతో ఆశ్చర్యమనిపించింది.

51వ వచనములో చెవికి ఉపయోగించబడిన నామవాచకము 50వ వచనములో వాడబడినది కాదు 51వ వచనములో నిజానికి చెవి యున్న స్థలముగా వాడబడు చున్నది; దానిని ఒక చెక్కతో చేయబడిన చెవిగా కూడా మనము చెప్పవచ్చు. దీనిని ప్రత్యేకముగా చెప్పడానికి గల ఉద్దేశ్యము మనము ఎంతో సులువుగా క్రీస్తు యొక్క మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయాన్ని విడిచిపెట్టేస్తుంటాము. "యేసు ఆయన చెవి యున్న ప్రదేశమును ముట్టెను." ఎందుకనగా ఆయన "నేనే" అని సంబోధించుకున్నారు. మరియు దేవుడు మాత్రమే శూన్యం నుండి సృష్టించగల సమర్థుడు. ఇది వైద్యపరముగా తిరిగి అతికించుట కాదు కాని తిరిగి సృష్టించుట అనే ఆశ్చర్యక్రియ.

అక్కడ మల్కు యొక్క తెగిన చెవి పడియున్నదని ఊహించు కోండి. కాని అతనికి ఒక క్రొత్త చెవియున్నది! అక్కడ తెగిన గాయముకానీ, రక్తమయమైన శరీరము లేదు – కాని ఒక పూర్తి చెవి! ఇంకా అక్కడ రక్తము కారుట లేక బాధతో కూడిన అరుపులు లేవు. కాని బహుశా కొద్ది నిముషములకు, తాము బంధించుటకు వచ్చిన వ్యక్తి చేసిన ఆశ్చర్యక్రియను చూచి నిశ్శబ్దముతో అబ్బురపడిరి.

మల్కుకు భవిష్యత్తు ఎలాగున ఉండనైయున్నది.నిజమైన అద్భుత చెవి గలిగిన వ్యక్తి? అతని అధికారి అయిన ప్రధాన యాజకుడు ఈ విషయమును గూర్చి మాట్లాడవద్దని చెప్పి యుంటాడా? అసలు మొదట ఆ నజరేయుడైన యేసును ముట్టుకోనిచ్చినందుకు ఆ అధికారి తిట్టియుంటాడా? ఇది అసలు జరగనే లేదని బుకాయించమని హెచ్చరించి యుంటాడా? ఇవేవీ నాకు తెలియదు కాని మల్కు మాత్రము ఆ రాత్రిని ఎన్నటికీ మరిచిపోడని నాకు తెలుసు. బహుశా కొంత కాలము తరువాత అతడు ఆ గొర్రెపిల్లపై విశ్వాసము ఉంచియుంటాడు.

## యేసు తన దృక్పథమును వీడుట!

యేసు అంతరంగమును మీరు తెలుసుకొనవలెనని నేననుకొనుచున్నాను. మరొకసారి యోహాను సువార్త 18:11 చదువుదాము.

శాంతముగా యేసుక్రీస్తు ఈ మోసమును ఎదుర్కొనుటలో గల ఆయన అంతరంగమును గూర్చి మీరు చదవనైయున్నారు. ఇదే, కోపముతో నున్న సమూహమును శాంతముగా ఎదుర్కొనునట్లు చేసింది, అధికారముతో మరియు దయతో సముదాయించునట్లుగా చేసినది. 11వ వచనము చూడండి.

**“యేసు కత్తి ఒరలో ఉంచుము; తండ్రి నాకు అనుగ్రహించిన గిన్నెలోనిది నేను త్రాగకుందునా అని పేతురుతో అనెను.”**

ప్రాతలోనిది త్రాగుట అనేది అనేకసార్లు శ్రమలను మరియు దు:ఖమును అనుభవించుటకు సాదృశ్యముగా వాక్యములో తెలియజేయబడుతుంటుంది. బబులోను యెరూషలేమును ఆక్రమించినప్పుడు, యెషయా 51 అధ్యాయమును కింగ్ జేమ్స్ తర్జుమా ప్రకారముగా చూస్తే ఆ పట్టణము ‘వణుకు అనే ప్రాతను” త్రాగినట్టిదైయున్నది. యిర్మీయా 25 వ అధ్యాయములో దేవుని ఉగ్రత అను పాత్రలో నుండి దేశముపై కుమ్మరించబడుచున్నట్లుగా చిత్రీకరించ బడినది. పాత్రలోనిది త్రాగుట అనగా క్లిష్టమైన అనుభవమును ఎదుర్కొనుట.

అదియే వ్యక్తీకరణ నేటికీ మనకు అభిరుచి లేని వాటి విషయమై మాట్లాడుతాము. “అది నేను త్రాగవలసిన టీ కాదు” అని అంటాము.

అనేక ట్రోఫీలు, కప్పుల వలె యుండుటకు గల కారణము వాటిని గెల్చుకున్న వారు ఆ స్థితికి రావడానికి వెనుక అనేక శ్రమలకోర్చి నిలువబడ్డారని తెలియజేయుటకు.

యేసు తాను అనుభవింపవలసియున్న శ్రమనంతటినీ ‘త్రాగవలసియున్న పాత్ర’ అని తెలియజేస్తున్నాడు.

యేసు తన పాత్రలో నుండి త్రాగుటకు ఎలా అంగీకరించుచున్నాడు? 11వ వచనము ఆయన దృక్పథం పరిపూర్ణమైనది అని తెలుపుతుంది ‘ఈ పాత్ర తండ్రి యొద్ద నుండి వచ్చినది’ అని ఆయన ధృడముగా నమ్ముచున్నాడు.

యేసు ప్రతి దాని వెనుక తండ్రినే చూస్తున్నాడు– యూదాను చూడలేదు – తండ్రినే చూస్తున్నాడు. కేవలము కోపముతో నున్న సమూహమును మాత్రమే చూడలేదు – దాని వెనుక నున్న తండ్రిని ఆయన చూస్తున్నాడు.

మా వంటగదిలోని కేలెండరుపై “ప్రతి దాని వెనుక దేవుని హస్తమును చూడగలిగిన కన్నులు మాత్రమే విశ్వాసపు కన్నులు!” అన్న వాక్యము వున్నది.

యేసు కుట్రను, బాధను, శ్రమలను సునాయాసముగా అనుభవించుటకు గల కారణము ఆయన వీటినన్నింటిని కలిగిన పాత్రను అందించుచున్న తండ్రి హస్తమును చూడగలుగుటయే.

సి.ఎస్. లూయిస్ ఇలా వ్రాసినాడు.

*సార్వభౌముడైన దేవునికి నీ జీవితమును అప్పగించు కొనుటే విధేయత గల హృదయము...*(ప్రతి దానిలో దేవుని హస్తమును చూచుట అన్న దానిని మరొక రీతిగా చెప్పడమే ఇది.)*... గాఢాంధకారపు లోయలో నున్ననూ, అంధకార అడవి అదిమివేయుచున్ననూ, అపవాదితో ముఖాముఖిగా అరణ్యము వంటి పరిస్థితులను ఎదుర్కొన్ననూ, అంధకారములోనూ, దేవుని యొక్క సర్వశక్తి కొరకు ఎదురు చూచుట.*

యేసు క్రీస్తు మనకు చూపిన మాదిరి ఎంత గొప్పది. నీవు లోయలో నున్నావా? నీవు మోసగించబడ్డావా? నీవు తృణీకరించబడ్డావా? నీవు శ్రమపడుచున్నావా? భయపడుచున్నావా! ఆ పాత్ర తండ్రి ద్వారనే సిద్ధము చేయబడి అందించబడుచున్నది! నీవు దానిని త్రాగలేవా!

పాత అమెరికా సామెత, “నీ చుట్టూనున్నవారు భయములో నున్నప్పుడు నీకు శాంతిగా యుంటే బహుశా నీవు వారి సమస్యను అర్థము చేసుకోలేదు”

సరే ఈ తోటలోని విషయాలు గమనించండి. సమూహమునకు – ఇది గలభా; శిష్యులకు – భయానకస్థితి; కాని యేసుకు–శాంతికర సమయము.

తోటలో గొఱ్ఱెపిల్ల మరణ శాసనముగా ఇచ్చిన సొత్తేమనగా ఆయన యోహాను 14:27లో ఇచ్చిన వాగ్దాన ప్రకారముగా జీవించుట.

**"శాంతిని మీ కనుగ్రహించి వెళ్లుచున్నాను; నా శాంతినే మీ కనుగ్రహించుచున్నాను; లోకమిచ్చునట్టుగా నేను మీకనుగ్రహించుట లేదు; మీ హృదయమును కలవరపడ నియ్యకుడి, వెరవనియ్యకుడి."**

## ఈ తోట దృశ్యమంతటిలో నీవెచటనున్నావు?

ఈ తోట సన్నివేశములో నీవెక్కడున్నావు?

- తృణీకరించిన సమూహములో నిల్చుని యున్నావా?
మత్తయి 12:30లో యేసు చెబుతున్నాడు

*"నా పక్షమును నుండని వాడు నాకు విరోధి..."*

క్రీస్తు యొద్ద తటస్థస్థితి అన్నది లేనేలేదు.

- కుట్రదారునితో నిన్ను పోల్చుకొనుచున్నావా?

దేవుని మరియు క్రీస్తును ప్రేమిస్తున్నట్లుగా నటిస్తూ నిజానికి నాకేమి వస్తుంది అని ఆలోచించుకొనే వాడిలా నున్నావా– ఒకవేళ నీకు దొరకక పోతే, యేసుకు మించినది ఏదైనా దొరికితే దాని కొరకు యేసును అమ్మివేస్తావా?.

- నీవు పేతురు వలె నున్నావా?

యేసుకు నీ సంరక్షణ అవసరము అని నిశ్చయించుకొని నీ స్వశక్తితో, నీ స్వంత బలంతో యేసును సేవించాలనుకుంటున్నావా?

- నీవు ప్రభు వలె నున్నావా?

ఈ ప్రశ్నకు "ఇది సరైన ప్రశ్న కాదు అలా ఎవ్వరునూ భావించుకోలేరు?" అన్నదే కదా నీ సమాధానం. అది నాకు తెలుసు. కాని సత్యము నిలిచియుంటుంది, ఫిలిప్పీ 2:5–8 అనుసరించి,

**"క్రీస్తు యేసునకు కలిగిన యీ మనస్సు మీరును కలిగియుండుడి...(యేసుక్రీస్తు) సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించుకొనెను."**

తండ్రి నీకు అందించిన పాత్ర ఏమిటి? ఆ పాత్రలోనిది త్రాగే సామర్థ్యము ఆ పాత్ర ఆయన నీకిస్తున్నాడని చూచే దానితో ముడిపడివుంటుందని నా నమ్మకము. ఈ పాత్ర తండ్రి యొద్ద నుండి వచ్చెనని విశ్వసిస్తేనే ఈ నీ పాత్రలోనిది నీవు త్రాగగలుగుతావు. దానికి గొప్ప విశ్వాసము అవసరము. క్రీస్తు వలె తండ్రి యందు నమ్మిక యుంచి నీ పాత్రలోనిది త్రాగెదవా? అయితే క్రీస్తు పాత్రను తలంచుకో! స్పర్జన్ ఒకసారి ఉపదేశించాడు. "తన పాత్రలోనివి ఏమిటో ఖచ్చితముగా ఎరిగి, ఆయన దానిని తీసుకొని చుక్క కూడా మిగల్చకుండ దానిలోనిది త్రాగివేసెను!"

ఎటువంటి రక్షకుడు! ఓ దేవుని గొఱ్ఱెపిల్లా... నీకు మేము నివాళులర్పించెదము.